క్లుప్తంగా

స్టాఫ్ గేమ్స్‌లో డిగ్రీ కళాశాల అధ్యాపకుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నగరి: తిరుపతిలోని ఎస్వీయూలో ఆదివారం జరిగిన యూనివర్సిటీ స్టాఫ్ గేమ్స్‌లో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ వేణు గోపాల్ తెలిపారు. టెన్నిస్ సింగిల్స్ విభాగంలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ భాస్కర రాజు, త్రోబాల్ మహిళా విభాగంలో బోటని అధ్యాపకురాలు అరుణకుమారి విజేతలుగా నిలిచినట్టు తెలిపారు. కళాశాలలో సోమవారం విజేతలను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర రాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ రెడ్డినాయక్, ఫిజికల్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ భాస్కర్, ఐక్యూ కోఆర్డినేటర్ ప్రియదర్శిని అభినందించారు.

చెరువు వేలంలో రూ.1.11 లక్షల ఆదాయం


చేపల చెరువు వేలం పాటలు నిర్వహిస్తున్న కార్యదర్శి లోకేష్

కార్వేటినగరం: మండలంలోని ఆర్కేవీబీపేట పంచాయతీలోని చేపల చెరువులకు సోమ వారం బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు సర్పంచ్ దివ్య, కార్యదర్శి లోకేష్ తెలిపారు. అన్నూరుచెరువు (తుమ్మలచెరువు) ద్వారా రూ.70,500లు, పెద్ద కమ్మచెరువు నుంచి రూ.41 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: స్పందనలో వచ్చిన వినతులపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బెన్నురాజు ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో 11 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్‌కు 2, డీకేటీ పట్టాలు ఇవ్వాలని 3, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 2, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 1, ఇంటి స్థలం ఇప్పించాలని 3 వచ్చినట్టు పేర్కొన్నారు.

తెరణిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర


మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

నగరి: తెరణి సచివాలయంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లీలా మాధవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల డింపుల్, ఎంపీటీసీ యేసు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం వడమాలపేటలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సేవలు నిరుపమానమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మీ, సచివాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, సమన్వయకర్త అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పిచ్చాటూరు: ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం రామాపురంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు కె.గంగాధరం, వ్యవసాయ శాఖ ఏడీ జె.సుబ్రమణ్యం, ఏఓ సంజీవరెడ్డితో కలిసి వెంగళత్తూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, వేపనూనె తయారీని, వినియోగాన్ని వివరించారు. రసాయన ఎరువుల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, టీచర్లు హరిప్రసాద్, దినకర్ బాబు, డాక్టర్ పాండురంగశెట్టి, తులసీరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి లక్ష్మికి ముందస్తు స్వాగతం



నగరి: ముడిపల్లి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో పొంగళ్లు పెడుతున్న విద్యార్థులు, గొబ్బియాలు ఆడుతున్న విద్యార్థులు,


పాలసముద్రం: బలిజకండ్రిగ హైస్కూల్‌లో గొబ్బిళ్లు ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నగరి: మండలంలోని పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు ఉండడంతో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు ప్రజా ప్రతినిధులు సంప్రదాయ దుస్తుల్లో సంబరాల్లో పాల్గొనడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా బోగిమంటల చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కోలాటాలు ఆడారు. పొంగళ్లు పెట్టి, చెరకు గెడలతో అలంకరించి సంక్రాంతి లక్ష్మికి ముందస్తు స్వాగతం పలకడం అందరినీ ఆకర్షించింది. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు పి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాలను మావిడాకులతో ముస్తాబు చేశారు. దేవతల చిత్రపటాన్ని ఉంచి చెరకు గెడలు, పువ్వులతో అలంకరించి పూజలు చేశారు. పొంగళ్లు పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరిదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ముడిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు వేసిన ముగ్గులు, పాలసముద్రం: బీసీ హాస్టల్‌లో భోగి మంటలు

విజయమాంబపురం పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

కార్వేటినగరం: మండలంలోని విజయమాంబపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందుస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు ఆవరణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. అలాగే భోగి మంటలు వేసి గొబ్బిళ్లు తట్టి ఆకట్టుకున్నారు. గోళీ ఆటలు, కర్రబిళ్ల తదితర ఆటలతో ఆనందంగా గడిపారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం పద్మావతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రమైన గంగాధర నెల్లూరు గ్రామ పంచాయతీ అక్కనగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోగి మంటలు వేశారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ముగ్గుల మధ్య గొబ్బెమ్మను ఉంచి పాటలు పాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాధరం, ఎస్ఎంసీ చైర్మన్ రేవతి, జీడీ నెల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెడ్డెమ్మ పాల్గొన్నారు.


గొబ్బిళ్లు తడుతున్న చిన్నారులు

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెంగళరాజుకుప్పం బీసీ బాలికల హాస్టల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగువల్లులు వేశారు. గొబ్బిపాటలు పాడారు. పొంగళ్లు పెట్టారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్ నాయుడు, హాస్టల్ వార్డెన్ కోటేశ్వరన్ సంక్రాంతి విశిష్టతను వివరించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.


ఏకాంబరకుప్పం జెడ్పీ హెచ్ఎస్‌లో పొంగళ్లుపెట్టి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు



ఓజీ కుప్పం పాఠశాలలో

నగరి: ఓజీ కుప్పం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం


పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ లత, నేతలు

కార్వేటినగరం: పేదల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ లత తెలిపారు. మండలంలోని క్రిష్ణాపురం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచ్ ధనశేఖర్ వర్మ ఆధ్వర్యంలో రూ.3 వేల పెన్షన్‌తోపాటు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రూ.1000 పెన్షన్ తీసుకోవడానికి కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి నగదు అందజేస్తున్నారని గుర్తు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న పెన్షన్లను రూ.3 వేలకు పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. మాట తప్పని జగనన్నను మరోసారి ఓట్లు వేసి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ఎంపీటీసీ మురగయ్య, ఎంపీడీవో మోహన్‌మురళీ, ఈవోఆర్డీ లక్ష్మీపతి, కార్యదర్శి వాణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేసిన చైర్మన్


చెత్తను తొలగిస్తున్న చైర్మన్ హరి

పుత్తూరు: మున్సిపాలిటీ చైర్మన్ హరి సోమవారం పట్టణంలో స్వయంగా పారిశుద్ధ్య పనులు చేశారు. పారిశుద్ధ్య కార్మికులు కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హరి స్వయంగా తన 23వ వార్డులోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువల్లోని చెత్తాచెదారం రోడ్డుపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. గమనించిన ఆయన స్వయంగా చెత్తను తొలగించి, నీరు యథావిధిగా వెళ్లేలా చేశారు.

పేదలకు మెరుగైన వైద్యం


మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

శ్రీరంగరాజపురం: పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ తరహాలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు జిల్లా జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. ఆయన సోమవారం ఆరిమాకులపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్నా వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిర్వహించిన వైద్య పరీక్షల్లో 10,386 బీపీ, షుగర్ కేసులు వెలుగులోకి వచ్చాయన్నాయని వెల్లడించారు. 3008 మందికి కంటి అద్దాలు అందజేశామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రంలో చికిత్స తీసుకున్న రోగులకు ప్రతి నెలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు వచ్చిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, గౌరి పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


చెకుముకి పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు

పెనుమూరు(కార్వేటినగరం): పలమనేరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ఆదర్శ విద్యాభవన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం ద్రాక్షాయణి తెలిపారు. పదవ తరగతి విద్యార్థిని జీ.మానస, తొమ్మిదవ తరగతి విద్యార్థి నందకిషోర్, ఎనిమిదవ తరగతి విద్యార్థి పీ.మహిత్ మొదటి స్థానంలో నిలిచారని, చిత్రలేఖనం పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయరాలు అనితను అభినందించారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ బాలచంద్రరాజు

పుత్తూరు: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాలిఫోర్నియా సిలికానాంధ్ర యూనివర్సిటీ అధ్యక్షుడు సి.బాలచంద్రరాజు కోరారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సరేంద్ర రచించిన భావతరంగాలు, అడవిమల్లి కవితా సంపుటిని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. విదేశాలకు వెళ్లినా మాతృభాషపై మక్కువ తగ్గలేదని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం పలు దేశాల్లో సిలికానాంధ్ర మనబడి యూనివర్సిటీ సేవలు అందిస్తోందని వివరించారు. పలు దేశాల్లో ఎన్ఆర్ఐలు తమ పిల్లలకు తెలుగు భాష నేర్పించడానికి ఇష్టపడుతున్నట్లు తెలిపారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం బాలచంద్రరాజును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

దళితుల సంక్షేమం పట్టదా..?


మాట్లాడుతున్నా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పయ్య

శ్రీరంగరాజపురం: టీడీపీ, జనసేన పార్టీలకు దళితుల ఓట్లు కావాలని, వారి సంక్షేమం పట్టదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని చంద్రబాబు హేళనగా మాట్లాడారని గుర్తు చేశారు. నేడు దళితుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని నారా లోకేష్, పవన్‌కళ్యాణ్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగనన్న దళితులకు పెద్ద పీట వేసి పలు ఉన్నత పదవులు కల్పించారని వివరించారు. పేద పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సహకారంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రూ.300 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారని వెల్లడించారు. ఉడములకుర్తి బ్రిడ్జి నిర్మాణానికి రూ.27 కోట్లు, వెదురుకుప్పంలో వైఎస్సార్ డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్, ఎన్‌టీఆర్ జలాశయానికి రూ.197 కోట్లు తదితర పనులకు నిధులు మంజూరుచేయించారని చెప్పారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్‌కు ఇన్ని రోజులు కనిపించలేదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దళితులకు సామాజిక న్యాయం కలిగిందని వివరించారు.

చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పథకాలు


కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలసముద్రం: రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని జెడ్పీటీసీ అన్నలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. వారు సోమవారం పాలసముద్రంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించేలా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పోలయ్య, సుందరరాజు, ధనుంజయన్, రవిరెడ్డి, కుట్టి, ప్రకాష్, చిన్నపయ్యన్, బాబు, చంద్రశేఖర్‌రాజు, వేణు, సుమన్, నరసింహన్, మనోహర్, గోపాల్, లోకిదాస్, నరసింహ నాయుడు పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవం


శిశువును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

గంగాధర నెల్లూరు: మహిళ 108లో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని ఒగ్గువారిపల్లికి చెందిన శైలజకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యంలో ఆమెకు నొప్పులు తీవ్రం కావడంతో 108 సిబ్బంది అశ్విక ప్రసవం చేశారు. ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, బిడ్డను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు 108 సిబ్బంది ఈఎన్‌టీ అశ్విక, పైలెట్ చిట్టిబాబు సూపర్‌వైజర్ మోహన్‌బాబును అభినందించారు.

శీతాకాలం.. పశువులు భద్రం!

- శీతాకాలం జాగ్రత్తలు తప్పనిసరి
- ఎండ తగిలేలా పాకలు ఉండాలి
- ఏడీ పద్మావతి సూచనలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యుడు పినాకపాణి (ఫైల్)

ఐరాల: శీతాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండడంతో పశుసంరక్షణకు తగిన జాగ్రత్తలు తప్పనిసరి. కొత్త గడ్డిని మేత మేసే పశువులు, గొర్రెలు, మేకలు బలహీనంగా తయారవుతాయి. సకాలంలో తగిన వైద్యం అందిస్తే పశువులను కాపాడుకోవచ్చని మండల పశుసంవర్థక శాఖ ఏడీ పద్మా వతి చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల నుంచి పశువుల సంరక్షణపై పాడి రైతులకు పలు సూచనలు చేశారు.

గురక లేక గొంతువాపు

పశువుల్లో గురక లేక గొంతువాపు వ్యాధి బ్యాక్టీరియా/సూక్ష్మజీవి కారణంగా వస్తుంది. పశువులకు గడ్డం కింద వాపు, కళ్లు ఎర్రపడటం, ముక్కు నుంచి తీగలు కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయి. ఈ వ్యాధి నివారణకు సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు మందులు వాడాలి. ముందస్తు టీకాలు వేయించి అరికట్టవచ్చు.

గాలికుంటు వ్యాధి

పికార్నో వైరస్‌తో పశువుల్లో గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. గిట్టలు ఉన్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడిన పశువులు నడవలేకపోతాయి. దీని నివారణకు గాలికుంటు టీకాలు ఆరు నెలలకోసారి వేయాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. గిట్టల మధ్యలోని పుండ్లను పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. బీస్ప్రెపెన్ మందు 2.5 గ్రాములు, ఎన్రోఫ్లాక్సిన్ 50ఎంఎల్ మందులు వాడడంతో పాటు వేప నూనె రాయడం వల్ల ఫలితం ఉంటుంది.

తిరుగుడు రోగం

రక్తంలోని ట్రిపనోజోమా పరాన్న జీవుల వల్ల పశువుల్లో తిరుగుడు రోగం సంక్రమిస్తుంది. ఇది అన్ని రకాల పశువులకు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు బెరేనిల్, ట్రిక్విన్, పెరిటాస్ మందులు వాడాలి.

సాధారణ చిట్కాలు

కాలానికి తగిన విధంగా ఆహారం, నీటిని అందిస్తూ పరిశుభ్ర వాతావరణంలో పశువులను ఉంచాలి. శీతాకాలం ప్రారంభం నుంచే అధిక చలి నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలి. పశువులకు దాణాను కాస్త ఆలస్యంగా ఇవ్వాలి. నట్టల నివారణకు మందులు ముందస్తుగా తాగించాలి. ఎఫ్ఎండీ, హెచ్ఎస్, బీక్యూ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువుల పాకల్లో సూర్యరశ్మి పడేలా చూసుకోవాలి. మండలంలో ఆవులు 19,907, గేదెలు 50, గొర్రెలు 10,400, మేకలు 4,418 ఉన్నాయి.


ఆవుకు వైద్యం చేస్తున్న ఏడీ పద్మావతి (ఫైల్)

ముందస్తు జాగ్రత్తలతో సంరక్షణ

పశువుల పెంపకంలో ముందస్తు చర్యలు చేపట్టడంతోనే సంరక్షణ సాధ్యమవుతుంది. వేసవి కాలం నుంచే పశువులకు టీకాలు వేయించాలి. మేలైన యాజమాన్య పద్ధతులు పశుపోషణ విషయంలో శ్రద్ధ తీసుకోవడం ద్వారా శీతాకాలంలో పశువులకు రక్షించకోవచ్చు. పశు వైద్యుల సలహాల మేరకే మందులు వాడాలి. పాడి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పద్మావతి, పశుసంవర్థక శాఖ ఏడీ, ఐరాల

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న రాస్ కేవీకే శాస్త్రవేత్త దివ్య

ఏర్పేడు: పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించడంతోపాటు ఆదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త దివ్య తెలిపారు. పాపానాయుడుపేటలోని రాస్ మహిళా భారతి సేవా నిలయంలో సోమవారం రైతులకు రుణమేళా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొలంలో దుక్కులు దున్నే సమయంలో లోతుగా దున్నడం వల్ల మొక్కల వేర్లు భూమిలోకి ఎక్కువగా పోతాయన్నారు. యంత్రాల ద్వారా వరినాట్లు వేసుకోవడం మంచిదన్నారు. వానపాముల పెంపకం, వర్మీకంపోస్టు ఎరువుల తయారీ గురించి వివరించారు. కేవీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రోన్ ద్వారా మందుల పిచికారీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 76 మంది రైతులకు రూ.28.5 లక్షల రుణాలు అందజేశారు. ప్రాజెక్టు అధికారి బాలాజీ రెడ్డి, వెంకటకుమార్, మునీంద్ర, హేమలత, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.